క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కుంటాల: కుంటాల మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు ఖానాపూర్‌లో 2కే రన్

ఖానాపూర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ఉదయం ఆరు గంటలకు 2కే రన్ నిర్వహించనున్నట్లు ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, యువతీ యువకులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

నేటి సమావేశానికి రావాలి

సోన్: కలెక్టర్ ఆదేశాల మేరకు సోన్ మండలంలోని దివ్యాంగులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సోమవారం ఉదయం పది గంటలకు నిర్మల్ మండలం సాగర్ కన్వెన్షన్ హాలులో జరిగే సమావేశానికి హాజరు కావాలని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



విరాళం అందిస్తున్న సుదర్శన్

ఖానాపూర్: ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ అభివృద్ధికి రిటైర్డ్ టీచర్ పాలెపు ప్రసూన–సుదర్శన్ దంపతులు రూ.50వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. అలాగే శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గడ్‌దాస్ లావణ్య–చరణ్ దంపతులు రూ.5వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎలిశెట్టి లింగేశ్వర్, డబ్బా శ్రీనివాస్, మాదాసు రాజేశ్వర్, పంబాల భీమేశ్వర్, భీంరావు, గాద్పు చందు, జోగు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

స్వర్గలోక రథం అందజేత



స్వర్గలోక రథం వద్ద దాత, గ్రామస్తులు

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సామ వికాస్‌రెడ్డి ఆదివారం గ్రామానికి రూ.మూడు లక్షల విలువైన స్వర్గలోక రథం విరాళంగా అందించారు. తమ నానమ్మ తాతలు సామ లింగవ్వ–పొట్టన్నల జ్ఞాపకార్థం రథం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, సర్పంచ్ సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.


సన్మానం

ఖానాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పత్రి నగేష్‌ను ఆదివారం ఎమ్మెల్యే రేఖానాయక్ శాలువాతో సన్మానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో నగేష్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. పదవి ఇచ్చినందుకు పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేందర్, కలీల్, గంగాధర్, శ్యాం, సతీశ్, ప్రదీప్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

పేద కుటుంబానికి సాయం

ఖానాపూర్: గాలివాన బీభత్సం కారణంగా ఇంటి పైకప్పు లేచిపోయి తీవ్రంగా నష్టపోయిన పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కంచి రాధ కుటుంబానికి పట్టణానికే చెందిన గంట తుకారావు, ఉపేందర్‌రావు రూ.ఆరు వేల సాయం అందించారు. ఇంటి కప్పు లేచిపోవడంతో రూ.లక్షకు పైగా నష్టపోవడంతోపాటు నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోశ్, నాయకులు తదితరులున్నారు.

గ్రామదేవతలకు పూజలు



గోదావరి నదికి వెళ్తున్న గ్రామస్తులు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు వర్షాల కోసం గ్రామదేవతలకు పూజలు చేశారు. ఊరేగింపుగా వెళ్లి తీసుకొచ్చిన గోదావరి జలాలతో గ్రామదేవతలకు పూజలు చేశారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.

వార్షికోత్సవానికి వేళాయె

- నిర్మల్‌లో నేటి నుంచి గండి రామన్న దత్తసాయి వార్షికోత్సవం
- రెండు రోజులపాటు వేడుకలు
- పాల్గొననున్న మంత్రి 'అల్లోల'
- తరలిరానున్న భక్తులు



శోభాయాత్రకు చేయించిన రథం



దత్తసాయి ఆలయం

నిర్మల్‌ఖిల్లా: శ్రీరాముడు అడుగిడి శివుడిని పూజించిన పవిత్ర క్షేత్రమే నిర్మల్‌లోని గండి రామన్న దివ్య క్షేత్రం. పచ్చదనం, సహ్యాద్రి కొండల మధ్య కొలువైన ఈ ఆలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. రామలింగేశ్వరుడితోపాటు ఏళ్ల కిందట కొలువుదీరిన షిరిడి సాయినాథుడు భక్తుల కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్నాడు. ఇక్కడి ఆలయ ప్రాంగణంలో గణపతితోపాటు దత్తాత్రేయుడు, అభయాంజనేయ స్వామి కొలువుదీరాడు. ఏడాది కిందట దత్తాత్రేయుడు, షిరిడి సాయినాథుడి ప్రతిమలను ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ట్రస్టీ లక్కడి జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు వేడుకలు..

జిల్లా కేంద్రం సమీపంలో కొలువుదీరిన శ్రీ దత్త సాయి గండి రామన్న దేవస్థానం వార్షికోత్సవం సోమవారం నుంచి రెండు రోజులపాటు సాగనుంది. తొలిరోజు జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ హనుమాన్ ఆలయం నుంచి గండి రామన్న ఆలయ క్షేత్రం వరకు రథయాత్ర సాగనుంది. ఈ రథాన్ని ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి, ఆయన సోదరుడు కాంట్రాక్టర్ లక్కడి జైపాల్‌రెడ్డి సుందరంగా తయారు చేయించి విరాళంగా బహూకరించనున్నారు. ఈ శోభాయాత్రలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి–విజయలక్ష్మి దంపతులతోపాటు భక్తులు పాల్గొంటారు. రెండోరోజైన మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహిస్తారు. భక్తులకు మధ్యాహ్న హారతి అనంతరం అన్నదాన ప్రసాద వితరణ చేస్తారు.

పేదలకు అందుబాటులో ఫంక్షన్‌హాల్..

గండిరామన్న దత్త సాయి ఆలయ ప్రాంగణంలో ఓ వైపు దేవాదాయ శాఖ నిధులతో నిర్మించిన ఫంక్షన్ హాల్(కల్యాణ మండపం)ను ఇటీవల మంత్రి ప్రారంభించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా రూ.30వేలతో కల్యాణ వేడుక జరిపించుకునేందుకు ఏర్పాట్లు ఉన్నాయని జగన్మోహన్‌రెడ్డి వివరించారు.



శ్రీ సాయినాథుని మూలవిరాట్టు

భక్తులకు సౌకర్యాలు కల్పించాం..



ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసేలా ఆలయ పరిసరాలు ఉన్నాయి. ఈ సంవత్సరం ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తాం. రెండు రోజుల పాటు సాగే వేడుకల్లో భక్తులకు ఇబ్బంది రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. భక్తులు కూడా తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలి.

– లక్కడి జగన్మోహన్‌రెడ్డి, ఆలయ ట్రస్టీ చైర్మన్

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముథోల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముథోల్‌లోని బస్వగార్డన్‌లో ముథోల్, తానూరు, బాసర మండలాల భవన నిర్మాణ కార్మికులు సమావేశం కాగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రతి కార్మికుడు తప్పనిసరిగా గుర్తింపుకార్డులతో పాటు ఇన్సురెన్సూ చేసుకోవాలన్నారు. ముథోల్‌లో సంఘం భవన నిర్మాణానికి నిధులు కేలాయిస్తామన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన ఐదుగురు భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఒక్కక్కరికి రూ.10 వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో భవన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామన్న, ఐలన్న, బీఆర్‌ఎస్ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, కాశీం, పోతన్నయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బాబన్న, రాజేశ్వర్, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భూమిపూజ

ముథోల్: మండలంలోని విఠోలి తండాలో రూ.20లక్షలతో నిర్మించే నూతన పంచాయతీ భవనానికి ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం వ్యవసాయ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, రైతుబంధు మండలాధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్ విజయ్, ఉపసర్పంచ్ కౌసల్యబాయి, విఠోలి సర్పంచ్ సత్యగౌడ్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

రహదారి ఎత్తు తగ్గించాలి

ముథోల్: బాసర–భైంసా జాతీయ రహదారి రోడ్డు ఎత్తు తగ్గించాలని ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ముథోల్ గ్రామస్తులు కోరారు. ఈసందర్భంగా రహదారి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జాతీయ రహదారి ఎత్తుగా నిర్మిస్తే.. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, పాఠశాల, వ్యవసాయ పనులను వెళ్లే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ విషయం జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి రోడ్డు ఎత్తు తగ్గించేలా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

నిరుపయోగంగా చెరువులు

- మిషన్ కాకతీయ పథకం కింద నామమాత్రంగా పనులు
- పూడుకుపోయిన కాల్వలు
- మెజార్టీ గ్రామాల్లో ఎండిపోయిన వైనం
- మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని రైతుల వేడుకోలు



పార్డి(కె) చెరువు కాల్వ దుస్థితి



చుక్క నీరు లేని దార్‌కుభీర్ చెరువు

కుభీర్: మండలంలో 41 పంచాయతీలుండగా వాటి పరిధిలోని గ్రామాల్లో 26 చెరువులు ఉన్నాయి. అందులో 8 చెరువులు పెద్దవి కాగా 18 పూడికతీత చెరువులు(సీల్ట్ అరెస్టింగ్ ట్యాంక్స్) నిర్మించినవి. ఈ పెద్ద చెరువుల నుంచి రైతుల పొలాలకు వెళ్లే నీళ్ల వెళ్లే కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. పూడిక చెరువులకు మాత్రం ఎలాంటి కాలువలు లేవు. నాలుగేళ్ల కిందట ఒక్క చాతా చెరువు కింద 200 ఎకరాల్లో, దొడర్నా, పార్డి(కె) చెరువుల కిందట పంటలు పండించేవారు. వీటితోపాటు, రంజిని, పార్డి(బి), హల్దా, పల్సి, కుభీర్ గ్రామాల్లో పెద్ద చెరువులున్నాయి. పార్డి(కె),దొడర్నా, కుభీర్ గ్రామాల్లో పెద్ద చెరువుల కాలువలను పూడ్చివేసి రైతులు పంటలు పండించుకుంటున్నారు.

పూడిక చెరువులున్న గ్రామాలివే..

మండలంలోని దార్‌కుభీర్, సౌనా, పాంగ్ర, మాలేగాం, సాగ్వి, చొండి, కస్రా, సిర్పెల్లి, కుప్టి, గొడ్సర, రాంనాయక్ తండా, మల్లాపూర్, బ్రహ్మేశ్వర్, సోనారి, జామ్‌గాం, బాకోట, హంపోలి, గోడాపూర్ గ్రామాల్లో పూడిక చెరువులు ఉన్నాయి.

చాతా, దొడర్నా గ్రామాల్లోని చెరువుల్లో మాత్రమే నీళ్లు..

మండలంలోని చాతా, దొడర్నా చెరువులు తప్పిస్తే మిగిలిన చెరువులలో చుక్క నీరు లేదు. అయినా ప్రభుత్వం ఇటీవల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఒక్కో చెరువుకు రూ.25వేలు ఖర్చు చేసి ఊరూరా చెరువుల పండుగ నిర్వహించింది. నీళ్లు లేకున్నా చెరువు కట్టలపై బతకమ్మ లాడారు. ఐదేళ్లుగా ప్రభుత్వం నీటి తీరువా బిల్లులు వసూలు చేయడం మానేసింది. అంతకుముందు దొడర్నా, పార్డి(కె), చాతా గ్రామాల రైతుల నుంచి నీటి తీరువా బిల్లులు వసూలు చేసేది. గతంలో ప్రభుత్వం అన్ని చెరువు ఆయకట్టులకు ఎన్నికలు సైతం నిర్వహించేది. ఇవి కాక మండలంలోని నిగ్వా, దొడర్నాలో లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకాలు) ఉన్నా.. గత 20 సంవత్సరాలుగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా చెరువులకు మరమ్మతులు చేసి కాల్వలు తవ్వించి తమ పంటలకు నీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

మేలు చేయని మిషన్ కాకతీయ..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిషన్ కాకతీయ పథకం చేపట్టి చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టింది. కానీ కుభీర్ మండలంలోని చెరువుల్లో మాత్రం పూడికతీత పనులు నామమాత్రంగా చేపట్టింది. ఈ పథకంతో మండలంలోని చెరువులకు మేలు జరగలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కాల్వలు తవ్వించాలి



మా గ్రామంలో గతంలో చెరువు కింద ఎటు చూసినా పచ్చని పొలాలు కనిపించేవి. పదేళ్లుగా కాల్వలు సక్రమంగా లేకపోవడంతో వరి కాక ఇతర పంటలను పండిస్తున్నారు. ప్రభుత్వం చెరువుల నుంచి కాల్వలు తవ్వించి పంటలకు నీళ్లు అందేలా చూడాలి. – సుంకరి సాయినాథ్, పార్డి(కె)

మరమ్మతులు చేయాలి



మండలంలోని చెరువులకు కాల్వలు, అలుగు గేట్లు సక్రమంగా లేవు. దీంతో గ్రామాల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అన్నింటికీ మరమ్మతులు చేసి పంటలకు నీళ్లు అందేలా చూడాలి.

– బాల పోతన్న, కుభీర్

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని చెరువుల కాల్వలు మరమత్మతులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం. రైతులెవరూ ఆందోళన చెందవద్దు.

– రమేశ్, ఇరిగేషన్ ఏఈ, కుభీర్

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

ఖానాపూర్: మరో అడెల్లిగా పేరు గాంచిన మండలంలోని సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏటా వానాకాలం పంటల సాగుకు ముందు రైతులు ఈ ఆలయానికి వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. అర్చకులు లింగన్న ఆధ్వర్యంలో పూజలు చేశారు.



సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద పూజలు

పాతఎల్లాపూర్‌లో పెద్ద పండుగ

ఖానాపూర్: మండలంలోని ఉమ్మడి పాతఎల్లాపూర్ పంచాయతీ పరిధిలో ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం పెద్ద పండుగ నిర్వహించారు. ఏటా వానాకాలంలో నిర్వహించే ఈ పండుగ సందర్భంగా పాతఎల్లాపూర్‌లోని సార్గమ్మల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్ — చినుకులకే చిత్తడిలా రోడ్లు..?



ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రోడ్లు చిన్నపాటి చినుకులకే చిత్తడిగా మారాయి. పట్టణంలో చేపట్టిన రోడ్డు వైడెనింగ్ పనులు సైతం ఏడాదికిపైగా నత్తనడకన సాగుతున్నాయి. వర్షపు నీరు నిలుస్తుండటంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియడం లేదు. వాహనదారులతోపాటు బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్, సెల్: 78421 50545

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కుంటాల: మండలంలోని లింబా(కే)లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం బబ్రు మహారాజ్ ఆధ్వర్యంలో ధాన్యాదివాసం, ఫలాదివాసం, హవనం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరావు పటేల్, ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీలు గిరీశ్‌కుమార్, కట్ట రవి, ఉపసర్పంచ్ ముత్యంరెడ్డి, సుభాశ్ జాదవ్, కౌన్సిలర్లు దిలీప్, సాయినాథ్, రామకృష్ణ, న్యాయవాదులు మోహన్,నరేష్, గ్రామపెద్దలు రాజన్న, జాదవ్ గణేశ్, అశోక్, రాజన్న, గోనె గజ్జారాం, భోజన్న పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

న్యూవెల్మల్‌లో గంగనీళ్ల జాతర

సోన్: సకాలంలో వర్షాలు కురిసి తమ గ్రామంలో పాడి పంటలు బాగుండాలని సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామస్తులు గంగనీళ్ల జాతర నిర్వహించారు. ఏటా మృగశిర కార్తె మొదటి ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి తీసుకొచ్చిన గంగాజలంతో గ్రామదేవతలకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకుల నాగయ్య, ఉపసర్పంచ్ గడ్డం స్వామి, వీడీసీ అధ్యక్షులు రేమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, వినోద్‌కుమార్, జ్ఞానేశ్వర్, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా బయలుదేరిన గ్రామస్తులు

ఘనంగా భీమన్న పండుగ



పుస్పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



తానూరులో ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్, లోకేశ్వరం గ్రామాల్లో ఆదివారం భీమన్న దేవుడి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవుడి ప్రతిమలను వీధుల్లో ఊరేగించి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పుస్పూర్ సర్పంచ్ సంగెం నర్సన్న, భీమన్న సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం భీమన్న పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ముదిరాజ్‌లు భజనలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం సమీపంలోని గుట్ట ప్రాంతంలో భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు బాగుండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో పండరి, సాయినాథ్, సుభాశ్, యోగేశ్, మల్లేశ్, పోశెట్టి, గణేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రేణుకామాత బోనాలు





జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్‌లో రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్